క్లుప్తంగా

జీతాలు చెల్లించడంలో తాత్సారం తగదు..

గజపతినగరం: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీ నెపంతో ప్రభుత్వం జీతాలు నిలిపి వేయడం సరికాదని ఎస్టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు జూన్, జూలై నెల జీతాలు కూడా అందని పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. కొద్ది రోజుల్లో సమస్య పరిష్కారం కానిఎడల ఉద్యమం చేపట్టక తప్పదన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన నెక్కల



మజ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు

కొత్తవలస: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నెక్కల నాయుడుబాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి, పార్టీ పునర్వైభవానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే తనకు రాష్ట్ర కార్యదర్శి పదవి వచ్చేందుకు కృషి చేసిన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ కురసా కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావులకు కూడా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు పీతల కృష్ణ, మదీన వెంకటరమణ, బూసాల దేముడు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.వెంకటరమణ, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌లతో నీటి సరఫరా



రేగిడివీధిలో ట్యాంక్‌ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న మేజర్ పంచాయతీ అధికారులు

చీపురుపల్లి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గల రేగిడివీధిలో మేజర్ పంచాయతీ అధికారులు వాటర్ ట్యాంకుల ద్వారా సోమవారం తాగునీరు సరఫరా చేశారు. కుళాయి పైప్‌లైన్ పాడవ్వడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రేగిడివీధితో పాటు సంతానలక్ష్మి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు, పాత కూరగాయల మార్కెట్, పోలీస్‌స్టేషన్ రోడ్డు, తదితర ప్రాంతాలకు రెండు రోజులు నీటి సరఫరా జరగదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇప్పటికే వెల్లడించారు. ఈ నేపథ్యంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. తాగునీటి పంపిణీ ఏర్పాట్లను శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ రాము పర్యవేక్షించారు.

సోంపురంలో కేంద్ర బృందం సర్వే



మరుగుదొడ్లు వినియోగంపై ఆరా తీస్తున్న కేంద్ర బృంద కమిటీ సభ్యులు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామ పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కేంద్ర బృంద సభ్యులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌మ రీసెర్ఛ్ ఇన్వెస్టిగేటర్ విజయ్‌కుమార్‌తో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ దేవీ, పంచాయతీ విస్తరణాధికారి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, ఎంసీఓ రాంబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విమలతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయా, లేవా.. డ్రైనేజీలు.. పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల, వెల్‌నెస్, గ్రామ సచివాలయాలను సందర్శించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎం శాంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన



సీడీపీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తవలస: ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సిగ్నల్స్ పనిచేయక అవస్థలు పడుతుంటే.. యాప్ ద్వారా హాజరు వేయడం సరికాదన్నారు. అనంతరం సీడీపీఓ ఆర్. ఉమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గాడి అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు, మోసానికి..
చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్

- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: తనను నమ్మి ఓట్లేసిన జనాన్ని మోసం చేయడం చంద్రబాబు నాయుడుకు ఆనవాయితీగా వస్తోందని.. నయవంచన, మోసానికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉత్తరాపల్లి, చిన్నపాలెం, అప్పన్నపాలెం గ్రామాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబుతో కలిసి ఆయా గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆయా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి కడుబండి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వివరించి.. వాటిల్లో ఎన్ని అమలు చేశారు, ఒక్కో ఇంటికి ఇంకా ఎంత రావాల్సి ఉందో వివరించారు. దీంతో ప్రజలు చంద్రబాబు పాలన, ఆయన అమలు చేస్తున్న పథకాలపై చీదరించుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలన, జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. నేటికీ ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగభృతి, దీపం, ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో పథకాలను అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను సూపర్‌గా కూటమి నేతలు మోసం చేసారని దుయ్యబట్టారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనే అబద్ధపు పాలనని మండిపడ్డారు. ఆయన మోసాలకు ప్రజలు మరోసారి మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న టీడీపీ నాయకులను ప్రజలు ఛీత్కరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాపల్లి, చిన్నిపాలెం, అప్పన్నపాలెం గ్రామాల సర్పంచ్‌లు సింగంపల్లి వెంకటలక్ష్మి, లక్ష్మి, కోన దేముడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సింగంపల్లి గణేష్, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, పార్టీ నాయకులు బొంతల వెంకటరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు మచ్చ ఎర్రయ్యరామస్వామి, మదీన అప్పలరమణ, బూసాల దేముడు, చింతల పైడినాయుడు, పల్లా భీష్మ, గంతకోరు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరాపల్లిలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,తదితరులు

మోసగాళ్లకు గురువు చంద్రబాబు..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

దత్తిరాజేరు: దేశంలో మోసగాళ్లకు గురువు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని కోమటిపల్లి రెల్వే గేట్ సమీపంలోని క్రిష్టాజీ లే అవుట్‌లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున అధ్యక్షతన సోమవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థీ ఉన్నత చదువులు చదువుకోవాలని 17 మెడికల్ కళాశాలలు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకువస్తే.. విజయనగరంలో కళాశాల నిర్వహణకు చంద్రబాబు వెనకడుగు వేయడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేయలేక కూటమి నాయకులు చేతులెత్తేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో టీడీపీ నాయకులు గ్రామాల్లో తిరగలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు జిల్లా నాయకులు కడుబండి రమేష్‌నాయుడు, మహదేవ్ ఫణీంద్రుడు, కంది తిరుపతినాయుడు, సుమల గోవింద్, మండల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను నమ్మించి మోసం చేశారు..

జామి: చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జాగరం గ్రామంలో సోమవారం సాయంత్రం పర్యటించి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. సూపర్‌సిక్స్ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని గ్రామాలకు వస్తున్న టీడీపీ నాయకులను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఫణిబాబు, నేతలు చలుమూరి సత్యారావు, పి.నరసింహనాయుడు, అప్పాన సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, పిన్నింటి రవి, ఎస్.చందు, జె.సూరిదేముడు, అప్పలరాజు, గేదెల రమణబాబు, మజ్జి హరి, వెంకటరావు, వాసు, తదితరులు పాల్గొన్నారు.



జాగరం గ్రామంలో చంద్రబాబు మోసపూరిత పాలన వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు..



భూదేవిపేటలో ప్రజలకు అవగాహన కలిగిస్తున్న నాయకులు

గజపతినగరం రూరల్: మండలంలోని భూదేవిపేటలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోవడంపై ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తయినా హామీలు నెరవేర్చకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, బెల్లాన త్రినాథరావు, కనకల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మోసాలపై ప్రశ్నించండి



చింతాడ గ్రామంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న నాయకులు

జామి: చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను కూటమి నేతలు గ్రామాల్లోకి వచ్చినపుడు ప్రశ్నించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్ అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని చింతాడ గ్రామంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. జగనన్న ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి మధ్య గల తేడాను వివరించారు. మహిళలు, రైతులు, యువకులను అన్ని రకాలుగా మోసం ఘనత చంద్రబాబుకే దక్కుతుందని చెప్పారు. జగనన్న పాలనలో పేద ప్రజలను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటే.. కూటమి ప్రభుత్వం పేదల పొట్ట కొట్టిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొంద్రంకి సంజీవి, చింతాడ సర్పంచ్, అప్పాన సుబ్రహ్మణ్యం, ఎన్నింటి శేషు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఇంటి పన్ను మినహాయింపు

- కొత్తవలస మేజర్ పంచాయతీ తీర్మానం

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న మాజీ సైనిక ఉద్యోగులకు ఇంటి పన్ను మినహాయింపు చేస్తూ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన సోమవారం జరిగిన సాధారణ సమావేశంలో తీర్మానించారు. అలాగే మరిన్ని తీర్మానాలు చేస్తూ సభ్యులు ఆమోదించారు. అనుమతుల్లేని లే అవుట్లలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉడా నిబంధనల మేరకు 14 శాతం ఫీజుతో ఇంటి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. అర్థన్నపాలెం గ్రామ సమీపంలో గల డంపింగ్‌యార్డును మరోచోటుకు తరలించేందుకు అనువైన స్థలం మంజూరుకు తహసీల్దార్‌ను కోరనున్నారు.



నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిరు వ్యాపారులు, షాపుల యజమానులు

అనంతరం కొత్తవలస జంక్షన్‌లో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతోందని, నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ పలువురు చిరు వ్యాపారులు, షాపుల యజమానులు సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, ఈఓ శైలజా, తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత..

గుర్ల: మండలంలోని దేవునికణపాకలో 40 లీటర్ల సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిసరాల్లో సోమవారం తనిఖీలు చేపడుతుండగా.. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సారా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వెంటాడుతున్న యూరియా కష్టాలు

చీపురుపల్లి: అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. కూటమి సర్కారు పుణ్యమాని ఎరువులకు ఐదేళ్ల కిందటి కష్టాలు మళ్లీ వచ్చాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు రైతులకు సరిపడా ఎరువులు సరఫరా లేకపోవడంతో అన్నదాతలు రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల చుట్టూ తిరగడమే కాకుండా రోజంతా అక్కడే క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తోంది. రోజంతా పడిగాపులు కాస్తే అందులో కొంతమందికి మాత్రమే ఒక్కో యూరియా బస్తా లభిస్తోంది. దీనికి మండలంలోని కర్లాం రైతుసేవా కేంద్రం వద్ద సోమవారం రైతులు పడిన కష్టాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఉదయం నుంచే రైతుసేవా కేంద్రం వద్ద రైతులు ఎరువుల కోసం క్యూ కట్టారు. సాయంత్రం వరకు ఒక్కో బస్తా మాత్రమే పంపిణీ చేయడంతో మరికొంత మంది రైతులు మిగిలిపోయారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. గతంలో సకాలంలో ఎరువులు అందేవని.. కూటమి పాలనలోనే ఇబ్బంది పడుతున్నట్లు పలువురు బహిరంగంగా విమర్శించారు.



కర్లాం రైతు సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచే క్యూలో ఉన్న రైతులు

పట్టాలు మంజూరు చేయండి..

దత్తిరాజేరు: సుమారు 150 సంవత్సరాలుగా తాతా, ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూములకు సంబంధించి పట్టాలు మంజూరు చేయాలని భూపాలరాజపురం గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ విజయ్‌భాస్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇనాం, బంజరు పేరుతో ఉన్న సుమారు 270 ఎకరాల భూమిలో పంటలు పండిస్తూ, విక్రయించుకోవడానికి సుమారు 130 మంది రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కుటుంబ అవసరాలకు తనఖా పెట్టడానికి గాని, విక్రయించుకోవడానికి గాని కుదరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి రైతులకు న్యాయం చేయాలని సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు, మాజీ సర్పంచ్ నీలకంఠం, రైతులు నారాయణరావు, సుధాకర్, మిత్తిరెడ్డి లక్ష్మి, అప్పలనాయుడు, తదితరులు కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూపాలరాజపురం రైతులు

'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' రేపు

వేపాడ: మండలంలోని వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముమ్మలూరి జగ్గుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేపాడలో ఉదయం ఏడున్నర గంటలకు.. వల్లంపూడిలో 9 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

'మురుగు'పై ఆరా



ఎస్.కోట రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ డోల మల్లికార్జునరావు

శృంగవరపుకోట: 'కోట'లో మురుగు కంపు ఎట్టకేలకు జిల్లా అధికారులను తాకింది. స్థానిక ప్రజాప్రతినిధులకు కనిపించింది. పత్రికల్లో 'కోట'ను కమ్ముకున్న మురుగుపై ఎన్ని వార్తలు ప్రచురితమైనా ఏనాడూ ప్రభుత్వ అధికారులకు కనిపించలేదు. ఎట్టకేలకు ఆదివారం హోరున వర్షం కురుస్తుండగా ఎస్.కోట వచ్చిన డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణకు మురుగు కనిపించింది. దీంతో ఆయన వెంటనే డీపీఓ, కలెక్టర్లకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో డీపీఓ డోల మల్లికార్జునరావు సోమవారం ఉదయం ఎస్.కోట వచ్చి పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. గతంలో ధారాళంగా నీరుపోయే పరిస్థితులు ఉండేవన్నారు. వాటికి అడ్డంకులు సృష్టించడం వల్లే ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ప్రధాన రహదారికి రెండువైపులా డ్రైయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఈఓపీఆర్‌డీ లక్ష్మి, ఎస్.కోట ఈఓ అనురాధ, తదితరులు ఉన్నారు.

ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాలి..

శృంగవరపుకోట: పంటల బీమా పథకానికి సంబంధించి రైతులు ఆగస్టు 15లోగా ప్రీమియం సొమ్ము చెల్లించాలని వ్యవసాయ శాఖ కొత్తవలస సబ్ డివిజన్ ఏడీఏ భానులత అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌ఎస్‌కే సిబ్బందికి ఖరీఫ్ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎకరా వరి పంటకు 200 రూపాయలు చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు.

అయోమయంలో అన్నదాతలు

- న్యాయం చేయాలంటున్న 'జిందాల్' నిర్వాసిత రైతులు

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ ఏర్పాటుకు భూములిచ్చిన ఒక్కో రైతు కుటుంబానికి ఒక్కో కథ ఉంది. సమస్యలతో రైతులు ఆందోళన చెందుతుంటే, వీరి సమస్యలను పరిష్కరించి, మార్గదర్శకం వహించే అధికారులే కనిపించడం లేదు. రైతుల భూముల్లో జిందాల్ వేస్తున్న అడుగుల సవ్వడి అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మండలంలోని కిల్తంపాలెం పంచాయతీకి చెందిన రైతులు కొందరు 'మా కష్టాలు చూడ్డరు.. మా ఊరికి రండి' అంటూ మీడియా ప్రతినిధులను పిలిచారు. దీంతో సోమవారం పలువురు మీడియా ప్రతినిధులు కొందరు రామన్నపాలెం వద్ద జిందాల్ సేకరించిన రైతుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పరిశ్రమ వస్తుంది.. మీ జీవితాలు బాగుపడతాయ్.. అని చెబితే నమ్మి భూములిచ్చామన్నారు. ఇప్పుడు కంపెనీ రాదు.. పార్కులు పెడతాం.. భూములు వదిలేసి పొమ్మని బెదిరిస్తున్నారు. నిత్యం పోలీసుల్ని మా చుట్టూ పహరా కాయిస్తున్నారు.. మేము దేశ ద్రోహులమా.. దొంగలమా.. అని ప్రశ్నించారు. ఉద్యోగం అన్నారు లేదు.. జీతం ఇవ్వలేదు.. బోర్లు, నష్టపోయిన ఇళ్లకు పరిహారం కూడా అందలేదు.. ఇప్పుడు వరి, చెరుకు పంటలు వేశాం. పంట చేతికి వచ్చే సమయంలో పంటలు తీసేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. పూర్వం నుంచి పండిస్తున్న భూములను వదిలేసి ఎక్కడకి పోవాలని రైతు మత్తి పెంటయ్య ప్రశ్నించారు. ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేశారని తానవరపు అప్పలనాయుడు అనే మరో రైతు వాపోయాడు. కంపెనీ ఏర్పాటు చేయలేదు కాబట్టి మా భూములు మాకు ఇవ్వాల్సిందేనని శిరికి స్వామినాయుడు, దేముడు, దారపురెడ్డి కన్నంనాయుడు, దారపురెడ్డి రాంబాబు, అప్పలనాయుడు, తదితరులు స్పష్టం చేశారు.



సమస్యలు చెబుతున్న జిందాల్ నిర్వాసిత రైతులు

ప్రమాణ స్వీకారం ..

గజపతినగరం: గజపతినగరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా లెంక బంగారునాయుడు సోమవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేసి, అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, బీజేపీ నాయకురాలు డాక్టర్ రెడ్డి పావని, మాజీ ఎంపీపీలు కొండపల్లి కొండలరావు, గంట్యాడ శ్రీదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, సీనియర్ నేత గుంప్రోతు గోవిందరావు, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోలకే పరిమితం..

- మంగళపాలెంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'
- మంత్రి అచ్చెన్నకు సమస్యలు వివరించిన ప్రజలు

కొత్తవలస: ఏ ఇంటికి వెళ్లినా మాకు తల్లికి వందనం రాలేదు.. అన్నదాత సుఖీభవ అందలేదు.. వంటి సమస్యలు చెబుతున్నారని.. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని మంగళపాలెం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పలు ఇళ్లకు వెళ్లి మీకు పింఛన్ వస్తుందా అని మహిళలను అడగ్గా.. నా భర్త పోయి ఏడాదవుతున్నా పింఛన్ రాలేదని ఒకరు బదులిచ్చారు.. అలాగే ఐతంశెట్టి పార్వతి ఇంటికి వెళ్లగా, నా మనవరాలు 2వ తరగతి చదువుతోందని తల్లికి వందనం రాలేదని చెప్పడంతో ఏదో సమస్య ఉందిది అందుకే రాలేదని బదులిచ్చారు. వెంటనే ఆయన చేతులో గల సుపరిపాలనలో తొలి అడుగు కరపత్లాను చిన్నారుల చేతుల్లో పెట్టి ఫొటోలు దిగారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని.. మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరారు. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని చెప్పిన మంత్రి.. రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే అధికారులతో మాట్లాడాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చిన్నారులకు కరపత్రాలను అందించిన మంత్రి అచ్చెన్నాయుడు